రైల్వేగేటు మూసివేతతో తిప్పలు

- అండర్ బ్రిడ్జిలో ప్రమాదకరంగా కాలినడక
- ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు మధ్య దశాబ్దాల తరబడి వారధిగా ఉన్న రైల్వేగేటును రెండేళ్ల క్రితం రైల్వే అధికారులు శాశ్వతంగా బంద్ చేశారు. రైల్వేగేటును శాశ్వతంగా మూసివేయడంతో పాటు ఇరువైపులా గేటు ప్రాంతంలో జాలిగోడ ఏర్పాటు చేశారు. అయితే గేటును పూర్తిగా మూసివేయడంతో పాదచారులకు ఇబ్బందిగా మారింది. గేటును పూర్తిస్థాయిలో మూసివేసినా రైల్వే అధికారులు కాలినడకన వెళ్లేవారికి వెసులుబాటు కల్పించేలా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. దశాబ్దాల తరబడి స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు మధ్య రైల్వే గేటు వారధిగా ఉంది. గేటు మూసినప్పుడల్లా రైల్వే గేటు ప్రాంతంలో, వివేకానంద చౌరస్తా వద్ద తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటం, పదిహేను నిమిషాల వరకు గేటుపడటంతో తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. ప్రజల డిమాండ్ మేరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రైల్వే బ్రిడ్జికి నిధులు మంజూరు అయ్యాయి. దాదాపు ఆరేళ్ల క్రితం రైల్వే ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. అయితే ఆర్‌ఓబీపై దాదాపు రెండు కిలోమీటర్లు అదనంగా తిరగాల్సి వస్తోందని, గేటు సమీపాన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు, స్థానికుల డిమాండ్ మేరకు ఎట్టకేలకు మూడేళ్ల క్రితం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అండర్ బ్రిడ్జి వినియోగంలోకి రాగానే రైల్వే శాఖ అధికారులు గేటును పూర్తిగా మూసివేశారు. ప్రజలు కాలినడకన అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలన్నా కనీసం 500 మీటర్లు అదనంగా తిరగాల్సి వస్తోంది. ఇటీవల అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.



శాశ్వతంగా మూసివేసిన రైల్వేగేటు



రైల్వేట్రాక్‌పై నుంచి వెళ్తున్న ప్రజలు



ఇరుకుగా ఉన్న అండర్ బ్రిడ్జి

ప్రమాదకరంగా పట్టాలపై నుంచి నడక

అండర్ బ్రిడ్జి నుంచి కాలినడకన వెళ్లడం ఇబ్బందిగా ఉందని రైల్వేగేటు ప్రాంతంలో ఏర్పాటు చేసిన జాలిగోడను కొందరు కాస్త తొలగించారు. దాంతో కొద్ది నెలలుగా శివునిపల్లి నుంచి ఘన్‌పూర్ వైపు, ఘన్‌పూర్ నుంచి శివునిపల్లి వైపు వెళ్లేవారు పలువురు పాదచారులు ఆ ప్రాంతం నుంచి రైల్వే ట్రాక్‌ను దాటుతున్నారు. అయితే ప్రస్తుతం గేటును పూర్తిగా మూసివేయడంతో అక్కడ గేట్‌మన్ తదితర సిబ్బంది ఎవ్వరూ ఉండటం లేదు. దాంతో రైల్వే ట్రాక్‌పై నుంచి దాటుతున్న పాదచారుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల పలువురు రైలు ప్రమాదాలకు గురైన సంఘనలు సైతం ఉన్నాయి. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, రైల్వేగేటు వద్ద పాదచారులు వెళ్లేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పాదచారులకు ఇబ్బందిగా ఉంది



దశాబ్దాల తరబడి ఉన్న రైల్వే గేటును పూర్తిగా మూసివేయగా వివిధ పనులపై వెళ్లే పాదచారులు అండర్‌బ్రిడ్జి నుంచి, రైల్వేట్రాక్‌పై నుంచి వెళ్తున్నారు. అయితే అండర్ బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- వాంకుడోత్ దశరథ్‌నాయక్, స్టేషన్‌ఘన్‌పూర్

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



పనులపై శివునిపల్లి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వైపు రావాలంటే రైల్వేట్రాక్‌పై నుంచి రావాల్సి వస్తోంది. రైలు పట్టాలపై నుంచి నడక ప్రమాదకరంగా ఉంది. గేటు ప్రాంతంలో పాదచారులు వెళ్లేలా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలి.

- గుర్రం ప్రమీల, శివునిపల్లి

అధికారులు స్పందించాలి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో రైల్వేగేటు ప్రాంతంలో పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రజల కోరిక మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రజలందరికీ అనువుగా ఉంటుంది.

- గాండ్ల సతీష్, శివునిపల్లి

విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. వచ్చే సంవత్సరం నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుందామని తెలిపారు. సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, నాయకులు ఇర్రి రమణారెడ్డి, బొడిగం చెంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే తమ్మడపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్మికుడికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

రఘునాథపల్లి: మేకలగట్టు గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు వేల్పుల నాగరాజు ఈ నెల 5వ తేదీన గ్రామంలో వీధిలైట్లు వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో హనుమకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే.. కాగా, మండలంలోని పంచాయతీ కార్మిక సంఘం నాయకులు సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును పరామర్శించి, బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న నాగరాజు ఆస్పత్రిలో అయ్యే ఖర్చు మొత్తం పంచాయతీ కార్యదర్శి భరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని వారు కోరారు. సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మగోని రాజేష్, బుస్సారి సత్యనారాయణ, రాపోలు రాజ్‌కుమార్, అజ్మత్, రాజయ్య, బిక్షపతి, మల్లేష్, షారోన్ తదితరులు ఉన్నారు.

సూపర్‌వైజర్ కుటుంబానికి..



సాయం అందజేస్తున్న ఆండాలు

కొడకండ్ల: కొడకండ్ల వ్యవసాయ మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గాడిపల్లి రమేశ్ ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని మార్కెట్ చైర్ పర్సన్ నల్ల ఆండాలు అన్నారు. సోమవారం బాధిత కుటుంబాన్ని మహబూబాద్‌లో పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. మార్కెట్ డైరెక్టర్‌లు దేశగాని నాగరాజు, బత్తుల వెంకన్న నారెడ్డి వెంకట్‌రెడ్డి , వీర్యానాయక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పరశురామ్

జనగామ రూరల్: ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన అద్దంకి దయాకర్‌ను సోమవారం హైదారాబాద్‌లో కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అంబేడ్కర ఫొటో అందజేసి అభినందనలు తెలిపారు.

'బెల్ట్‌షాపులు మూసివేయించండి'

రఘునాథపల్లి: ఫతేషాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తోన్న బెల్ట్‌షాపులను వెంటనే మూసి వేయాలని యువకులు అదనపు కలెక్టర్‌ను కోరారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను కలిసి బెల్ట్‌షాపుల విషయంలో సంబంధిత విభాగాలు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఇబ్రహీంపూర్ గ్రామంలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయవద్దని ఏకగ్రీవంగా గ్రామస్తుల తీర్మానంతో ఆరేళ్లుగా మద్య నిషేధ గ్రామంగా అమలవుతోందన్నారు. తమ గ్రామానికి ఆనుకొని ఉన్న ఫతేషాపూర్‌లో ఏడు బెల్ట్ షాపులు ఉండటంతో యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారన్నారు. దీంతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి నెలకొందన్నారు. ఈ విషయంలో వెంటనే స్పందించి బెల్ట్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఆదనపు కలెక్టర్‌కు యువకులు విజ్ఞప్తి చేశారు. తమ వినతికి అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని యువకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



జఫర్‌గఢ్: పొలం వద్ద మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై పాడి గెదే మృతి చెందిన సంఘటన మండలంలోని మగ్దుంతండా గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రైతు బానోత్ వాసుకు చెందిన గెదే పొలం వద్ద మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెంది. సుమారు రూ.50 వేల విలువ చేసే పాడి గెదే మృతి చెందడంతో బాధిత రైతు తీవ్రంగా నష్టపోయాడని..ప్రభుత్వ పరంగా పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బచ్చన్నపేట: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు కాకుండా.. ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. సోమవారం పోచన్నపేట, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, సీసీలు నర్సింహులు, తిరుమల, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత

ఐకేపీ ఆధ్వర్యంలో పది కొనుగోలు కేంద్రాలు

కొడకండ్ల: యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు గాను మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో పది కేంద్రాలు మంజూరైనట్లు ఏపీఎం సత్యనారాయణ సోమవారం తెలిపారు. కొడకండ్ల, కడగుట్టతండా, ఏడునూతుల, గిర్నితండా, మొండ్రాయి, నర్సింగాపురం, పాలకొండ, రంగాపురం, రామవరం, పాకాలలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నెరవేరనున్న పేదల సొంతింటి కల



పాలకుర్తి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమిపూజలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి/పాలకుర్తిటౌన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతి కల నెరవేరనుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తీగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తీగారంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరలో రాష్ట్రం వ్యాప్తంగా అమలుకానుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల భాస్కర్, మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

వల్మిడి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో టెంట్ కూలి ప్రమాదానికి గురైన మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన బాలిక మారెపల్లి మనుశ్రీతో పాటు బాధితులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, రాఘవరావు, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

గ్యాస్ ధర పెంపు అన్యాయం

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం అన్యాయం అని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను సంపన్న వర్గాలకు దోచిపెట్టి నేడు గ్యాస్ తదితర ధరలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన భారాన్ని మోపుతోంది మండిపడ్డారు. గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



బ్యాగులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, కంపెనీ నిర్వాహకులు

చిల్పూరు: లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మకిన్ ఎనర్జీ కంపెనీ నిర్వాహకులు ఐదు కంప్యూటర్లు, ప్రింటర్, ల్యాబ్ పరికరాలు, విద్యార్థులకు స్నాక్స్, స్కూల్ బ్యాగులు, కుర్చీలు తదితర సామగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు సామగ్రిని మకిన్ ఎనర్జీ కంపెనీ నిర్వాహకులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్ సుధీర్‌కుమార్, పవన్, సురేశ్, మెర్సీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరాచారి, ప్రసన్నకుమార్, భిక్షపతి, రాంబాబు, సమత, ఫాతిమ, రజిత పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



జనగామ రూరల్: పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

- కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

జనగామ రూరల్/నర్మెట/తరిగొప్పుల/బచ్చన్నపేట: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం పలు గ్రామాల్లో పాదయాత్ర చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ దేశ ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోందని అన్నారు.



నర్మెటలో..



తరిగొప్పుల: బొంతగట్టునాగారంలో..



బచ్చన్నపేటలో..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను లభిస్తుందని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తమ్మడపల్లి గ్రామంలో ఈజీఎస్ పనుల వద్ద కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైనందున పిల్లలను తల్లిదండ్రులు చేర్పించాలని కోరారు. ఎంపీడీఓ వెంకట మల్లికార్జున్, అమ్మా ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ నూనెముంతల నిఖిత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

రేషన్ బియ్యం స్వాధీనం

దేవరుప్పుల: సీత్యతండాలో గుగులోత్ యాకు అనే వ్యక్తి తన ఇంటి ఆవరణలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. సదరు వ్యక్తిపై చట్టపరంగా కేసు నమోదు చేశామని, ఎవరైనా రేషన్ బియ్యం విక్రయించినా ,కోనుగోలు చేసినా చర్యలకు గురవుతారని ఎస్సై హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న బియ్యంతో పోలీసులు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పాలకుర్తి టౌన్: వావిలాల గ్రామంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి సీఐ వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం తులసియా తండాకు చెందిన బానోత్ నవీన్ ఈజీ మనీకి అలవాటు పడి చోరీలు చేస్తూ వచ్చిన మొత్తంతో జల్సాలు చేస్తున్నాడు. కాగా, గత నెల పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో బెల్లి మల్లేష్‌యాదవ్ ఇంట్లో చొరబడి రెండున్నర తులాల బంగారం, రెండు జతల వెండి పట్టీలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐ, ఎస్సై పవన్‌కుమార్‌లు క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బంగారం, వెండి నగలు, సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో గూడూరు, నెల్లికుదురు మండలాల్లో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుల్ రమేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కడియంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతికుమార్

రఘునాథపల్లి: నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నారని, ఇకపై సహించబోమని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ యూత్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లా, రాజయ్యలు దళితుల్ని ముందు పెట్టి నిరాదార ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. అగ్రవర్ణ నాయకుల ఆదేశాలకు అనుగుణంగా కొందరు దళిత నాయకులు దళిత జాతికి మచ్చ తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్థాయిని మించి ఆరోపణలు చేస్తే యూత్ కాంగ్రెస్ నాయకులు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గ అధ్యక్షుడు ఇల్లందుల విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీటకూరు సంపత్, మొగిలిపాక ఉదయ్, మునీర్, చీటకోయిల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రాంతికుమార్

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, యువత అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.వేణు అన్నారు. స్థానిక హోలీక్రాస్ పాఠశాలలో విద్యార్థులకు సీఐ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లవద్దని సూచించారు. విద్యార్థుల అలవాట్లు, ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనల మేరకు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు.

తలకాయలగుట్టపై గుడ్‌ఫ్రైడేకు అనుమతి ఇవ్వాలి

- క్రైస్తవ సంఘం నాయకుల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారులోని సర్వేనంబర్ 979లోని తలకాయలగుట్ట(కల్వరికొండ)పై గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగ వేడుకలను నిర్వహించుకునేందుకు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని స్టేషన్‌ఘన్‌పూర్ నిర్మలమాత దేవాలయ క్రైస్తవ సంఘం అధ్యక్షుడు సింగపురం రాజయ్య, మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.వేణుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కల్వరికొండపై ప్రతీ ఏడాది గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేసేవారిమని, భక్తుల సహకారంతో రెండుబోర్లు, వాటర్‌ట్యాంక్‌లు, మెట్ల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. అయితే 2016లో స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామంతో సంబంధం లేని కొందరు ఉద్దేశ్యపూర్వకంగా గొడవలు సృష్టించి హిందువులు, క్రిస్టియన్ల మధ్య చిచ్చు పెట్టారన్నారు. దాంతో అధికారులు తలకాయలగుట్టపైకి ఎవ్వరూ వెళ్లవద్దని, 145 సెక్షన్‌ను అమలు చేశారన్నారు. అప్పటి నుంచి చట్టాన్ని గౌరవిస్తూ క్రైస్తవుల తలకాయల గుట్టపైకి వెళ్లడం లేదన్నారు. అయితే ఎదుటి వర్గం వారు ఇటీవల చట్టాన్ని అతిక్రమిస్తూ అక్కడ శివాలయ నిర్మాణం చేస్తున్నారని, శివరాత్రి పూజలు చేశారని, గుట్టపై లైట్లు ఏర్పాటు చేశారన్నారు. ఈవిషయమై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గుడ్‌ఫ్రైడే రోజు స్థానిక నిర్మలమాతా దేవాలయం నుంచి కలువరికొండ వరకు శిలువ యాత్ర ఉంటుందని, అన్నదాన కార్యక్రమం చేస్తామన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందిస్తూ 145 సెక్షన్‌ను ఎత్తివేయాలని వారు కోరారు. పీఏసీఎస్ డైరెక్టర్ చింత ఎల్లయ్య, క్రైస్తవ సంఘం బాధ్యులు సింగపురం నాగయ్య, జ్యోతికుమార్, జీడి రమేష్, చింత శ్రీను, మారెపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, తాటికొండ వినయ్, బైరపాక వినోద్, అఖిలాష్, ప్రతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రైస్తవ సంఘం నాయకులు